ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక
సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం
Your Ad Here.
ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

## షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

- ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో
- ఫోక్సో కేసు పెట్టారని ముగ్గురి హత్య
- విచిత్రంగా భార్యా ఇద్దరు పిల్లల నరికివేత
- అనంతరం గ్రామం నుంచి పరార్
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు
- సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన



➢ 2వ పేజిలో..

SUNDAY 12TH JULY 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 116 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 12 జూలై 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :116 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

- మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాలు
- గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం
- గేట్లు మూస్తే ప్రాజెక్ట్ కొట్టుకు పోతుందని హెచ్చరిక
- ప్రజలను తప్పదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు
- బిఆర్‌ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల
- జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
- ఈటెల, బిఆర్‌ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- మిడిమయా సమావేశంలో సిఎం రేవంత్ స్పష్టీకరణ



హైదరాబాద్,జులై11 కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు.

శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్‌ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్టు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్‌ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్‌ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు.

➢ మిగతా 2వ పేజిలో..



## నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

- వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి
- ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తాం
- సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను
- సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్,జూలై11 అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి

➢ మిగతా 2వ పేజిలో..

## సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం

➢ మిగతా 2వ పేజిలో..



## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

- ఈ ప్రయాణం ముమ్ముందు మరింత విజయవంతమవుతుంది
- ప్రవాస భారతీయలు కృషి ఇందుకు ప్రధాన కారణం
- న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ

ఆక్లాండ్,జులై 11 భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో

➢ మిగతా 2వ పేజిలో..

## సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

- హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్
- టీ-వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్,జులై 11:సెమీకండక్టర్ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి సీఎంపీ కెమికల్ మెకానికల్ పాలిషింగ్ ప్యాడ్ టెక్నాలజీ హబ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ హబ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. జపాన్‌కు చెందిన తోహో కోకి సంస్థ సాంకేతిక సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోని ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. జపాన్‌తో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ అత్యాధునిక సెమీకండక్టర్ టెక్నాలజీ అభివృద్ధికి ఈ హబ్ వేదికగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. చిప్ తయారీ పక్రియలో అత్యంత కీలకమైన సీఎంపీ ప్యాడ్

➢ మిగతా 2వ పేజిలో..



## ప్రముఖ గాయని ఎస్. జానకి కన్నుమూత

**వయోభారంతో మైసూరులో మృతి**

మైసూరు,జులై 11 సుస్వరాల గొంతుక మూగబోయింది. తన గాన మాధుర్యంతో తెలుగు శ్రోతలను అలరించిన గంధర్వ గాయని పరలోకానికేగారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన ఆమె అన్ని భాషల్లో కలిపి ఆమె సుమారు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమంలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె

➢ మిగతా 2వ పేజిలో..

## కాలం తెచ్చిన కారుకు కాదు...కాంగ్రెస్ కరువు

- గోదావరిలో నీళ్లు ఉన్నా ఉపయోగించుకోని దరిద్రం
- కావాలనే నీటిని వృధాగా వదులుతున్నారు
- మీడియా సమావేశంలో మరోమారు కెటిఆర్ విమర్శలు



➢ 2వ పేజిలో..

## వియత్నాంలో ఘోర ప్రమాదం

- పర్యాటక బోటు బోల్తా పడి 19మంది జలసమాధి
- పలువురు పరిస్థితి విషమం..ఆస్పతక్రిలో చికిత్స
- విహార యాత్రకు వెళ్లిన తెలుగువాలో పలువురు మృతి
- మృతుల్లో కడప, మచిలీపట్నలంకు చెందిన వారు
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ..హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు

హనోయ్,జులై 11 వియత్నాంలో ఘోర విషాదం చోటు చేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ

➢ మిగతా 2వ పేజిలో..

# నన్ను చంపాలనుకుంటే ఇరాన్ మటాష్

ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్ పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు.యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్దానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

# ప్రముఖ గాయని ఎస్. జానకి కన్నుమూత

ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను పాడారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, 33 వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి ఆమె సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మభూషణ్‌తో సత్కరించింది. తొలితరం ఘంటసాల నుంచి మలితరం బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అద్భుత గీతాలు ఆలపించారు. పగలే వెన్నెలా అంటూ పలకరించిన మన జానకి లేదన్న విషయం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతను గౌరవించాల్సిందిగా కోరుతున్నా' అని అప్సర తెలిపారు.

## వియత్నాం దుర్ఘటనలో పదిమంది తమిళవాసుల మృతి

**ఘటనపై రాష్ట్రపతి, ప్రదాని సంతాపం**

న్యూఢిల్లీ,జులై 11 వియత్నాంలో జరిగిన ఘోర బోటు ప్రమాదంలో 15 మంది మరణించగా.. వారిలో 10 మంది తమిళనాడుకు చెందిన వారేనని తెలిసింది. మిగతా వారిలో ముగ్గురిని ఏపీ, ఇద్దరిని కేరళకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ఘటనలో కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం వివరాలు వెల్లడించింది. బోటు ప్రమాద ఘటనపై భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. అక్కడున్న మన రాయబార కార్యాలయం, కాన్సులేట్‌లు అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నాయని, వియత్నాం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని చెప్పారు. మరోవైపు, ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన బాధితులకు సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

**విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం**

హైదరాబాద్,జులై 11 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు.

# కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు

హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్దాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వియత్నాంలో ఘోర ప్రమాదం

సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరపున డీలర్స్ టూరిస్టులుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తమిళనాడు వాసులు చనిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యుల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూడా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్ లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

# షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం

రంగారెడ్డి,జూలై11 రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. నిందితుడు భార్య, పిల్లలను కూడా హత్య చేయడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని సీపీ తెలిపారు.

# కాలం తెచ్చిన కారుకు కాదు...కాంగ్రెస్ కరువు

హైదరాబాద్,జులై11 ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు.

రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళ్లు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు.గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు

చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుర్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ అనాలా , దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు.

## డ్రగ్స్ మాఫియాపై ఈగిల్ ఉక్కుపాదం

దేశవ్యాప్తంగా వరుసగా భారీగా డ్రగ్స్‌ను సీజ్ చేశారు. రాంచీలో 500 కిలోలు, ఒడిశాలో 500 కేజీలు, తాజాగా 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల నిఘాతో డ్రగ్స్ రవాణా ముఠా ఆగడాలను ఆటకట్టించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో 385 కేజీల గంజాయిని ఈగల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల పాటు నిఘా ఉంచి డ్రగ్స్ రవాణా ముఠాను ట్రాక్ చేశారు. ఒడిశాలోని జయ్‌పూర్ సమీపంలోని దేవఘాటి నుంచి బయలుదేరిన గంజాయి లోడ్‌ను నిరంతరం ఫాలో అయ్యారు. కోల్‌కతా, ముంబై జాతీయ రహదారిపై గంజాయి వాహనాన్ని ఎన్సీబీ రాయ్‌పూర్ బృందం అడ్డుకుంది. మహారాష్ట్ర, రాజస్థాన్‌కు తరలిస్తున్న గంజాయిని గమ్యానికి చేరకముందే స్వాధీనం చేసుకున్నారు. కేసులో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ మహదేవ్ భీల్‌ను అరెస్ట్ చేశారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎన్సీబీ అధికారులు ఆపరేషన్ విజయవంతం చేశారు. రాష్ట్ర సరిహద్దులు దాటి డ్రగ్స్ మాఫియాపై ఈగల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ వ్యతిరేక పోరులో కీలక శక్తిగా ఈగల్ అధికారులు మారారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో మరింత దూకుడుగా ఈగల్ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.

## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యాయని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

# సెమీకండక్టర్ రంగంలో మరో కీలక ముందడుగు

టెక్నాలజీ ఇకపై హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడంతో దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు ఊతం లభించనుంది. ఈ హబ్ ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు పరిశోధన, ఉత్పత్తి అభివృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే 18 నుంచి 24 నెలల్లో దేశీయంగా సీఎంపీ ప్యాడ్ల తయారీని ప్రారంభించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి శీధర్ బాబు తెలిపారు. సెమీకండక్టర్ తయారీకి అవసరమైన కీలక సాంకేతికతలను తెలంగాణలోనే అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశోధన నుంచి నైపుణ్యాభివృద్ధి, ప్రోటోటైపింగ్, చిప్ తయారీ వరకు సమగ్ర సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను నిర్మించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి శీధర్ బాబు వెల్లడించారు.

## ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

- పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత
- ఆర్జీ 3 జిఎం సంకరి మధుసూదన్ రావు



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జులై 11 అక్షరం న్యూస్:

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని రామగుండం -3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.శనివారం జి.యం. కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఏరియా పర్యావరణ విభాగాధిపతి పి.రాజారెడ్డి జి.యం కార్యాలయ అధికారులు, ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జి.యం.మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి మనమందరం కృషి చేయాలని కోరారు.వివిధ సందర్భాలలో మనం నాటుతున్న మొక్కలను సంరక్షించాలని సూచించారు.ముఖ్యంగా ప్రస్తుతం ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ప్లాస్టిక్ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు.సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు.అనంతరం జూన్-5, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.యం. కార్యాలయ ఉద్యోగులకు పర్యావరణంపై నిర్వహించిన పరీక్ష లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జనపనార సంచులను అందజేశారు. అలాగే ఏరియాలోని వివిధ గనుల, విభాగాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు కూడా అందజేశారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, రవికుమార్, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు బి.టి.మురళీ కృష్ణ, ఎస్వోటుజియం యం. రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఉదయ భాస్కర్, విభాగాధిపతులు బి.సుదర్శనం, సి.జె.సురేఖ,రాజేశ్వరి, ఆసిఫ్ యాసిన్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- ఆలయ కమిటీ చైర్మన్‌గా నూనేటి అంజి యాదవ్



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూలై 11 (అక్షరం న్యూస్):

రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నూతన కమిటీని శనివారం గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీలో గౌరవ అధ్యక్షులుగా పుల్లెల సతీష్, ఆలయ కమిటీ చైర్మన్‌గా నూనేటి అంజి యాదవ్, వైస్ చైర్మన్‌గా కన్నూరి కైలాష్, ప్రధాన కార్యదర్శిగా ఉగ్గే ప్రశాంత్, కార్యదర్శిగా కన్నూరి శశికుమార్, కోశాధికారిగా కన్నూరి కిరణ్ ఎన్నికయ్యారు. అలాగే కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా మాజీ ఆలయ కమిటీ ఆలయ అభివృద్ధికి అందించిన సేవలను గుర్తిస్తూ నూతన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య మరియు ఆలయ పూజారి శ్రీకరాచార్యులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## వైభవంగా ఉమామహేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

స్థానిక పర్మనెంట్ టౌన్‌షిప్ కాలనీలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితుడు బ్రహ్మశ్రీ రాంపల్లి రామశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వార్షికోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ముగింపు సందర్భంగా ఉదయం నిత్యపూజలు, అభిషేకం, అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం హోమాలు, నాగబలి, వసంతోత్సవం, బలి ప్రదానం, పూర్ణాహుతి వంటి విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ అవధాని ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు విశేషంగా సాగాయి.

పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, ఉత్సవాలు భక్తిమయ వాతావరణంలో వైభవంగా ముగిశాయి.

# కల్వచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 1000 నోట్‌బుక్కుల పంపిణీ

- రూ.40 వేల విలువైన విద్యా సామగ్రి అందజేత
- ఐదేళ్లుగా కొనసాగుతున్న సేవా కార్యక్రమం



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూలై 11 (అక్షరం న్యూస్):

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం సికింద్రాబాద్ చిలుకలగూడలోని కట్ట మైసమ్మ--పోచమ్మ దేవాలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి తిరుమలాచార్యులు తమ తండ్రి, సోదరుల జ్ఞాపకార్థం 1000 నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.మారుతీనగర్, కల్వచర్లకు చెందిన దివంగత సౌమిత్రి నారాయణాచార్యులు స్మారకార్థంగా ఆయన కుమారుడు సౌమిత్రి తిరుమలాచార్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణాచార్యులు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందడంతో పాటు ప్రముఖ పంచాంగ, వాస్తు పండితులుగా కూడా గుర్తింపు పొందారు.సొంత గ్రామంపై ఉన్న మమకారంతో కల్వచర్లకు వచ్చిన తిరుమలాచార్యులు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అత్యధిక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. మారుతీనగర్‌కు చెందిన చావ సిద్ధూ--శ్రీనివాస్ ద్వారా విద్యార్థులకు నోట్‌బుక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 500 లాంగ్ నోట్‌బుక్కులు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 500 క్రౌన్ సైజు నోట్‌బుక్కులు, మొత్తం 1000 నోట్‌బుక్కులు (సుమారు రూ.40 వేల విలువైనవి) పంపిణీ చేశారు.ఫోన్ ద్వారా విద్యార్థులతో మాట్లాడిన సౌమిత్రి తిరుమలాచార్యులు ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. గత ఐదు సంవత్సరాలుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రతి ఏడాది నోట్‌బుక్కులతో పాటు ఇతర విద్యా సామగ్రిని కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌమిత్రి తిరుమలాచార్యులకు ఫోన్ ద్వారా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ దేవళ్ళ వనజ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు కుంట వెంకటేశం, గుండేటి సత్యనారాయణ, రమాదేవి, సత్యవతి, మల్లారం శంకర్, ఆడెపు రవి, జి. దేవేందర్, పీఈటీ సతీష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## 14న కేంద్ర బొగ్గు శాఖ మంత్రి గోదావరిఖనికి రాక

- ఓసీ--5 సందర్శన అనంతరం కార్మికులతో సమావేశం.. బహిరంగ సభలో పాల్గొననున్న కిషన్ రెడ్డి
- భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి: బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్ : తాడిచెర్ల బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సింగరేణి సంస్థ భవిష్యత్తుకు, కార్మికుల ఉపాధి భద్రతకు ఎంతో కీలకమైన చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ నెల 14న గోదావరిఖనికి రానున్నారని తెలిపారు. పర్యటనలో భాగంగా ముందుగా ఓసీ--5 గనిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించడంతో పాటు సింగరేణి కార్మికులతో సమావేశమై మాట్లాడనున్నారని చెప్పారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని కార్మికులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు వెల్లడించారు.తాడిచెర్ల బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించడం వల్ల సంస్థకు దీర్ఘకాలికంగా బొగ్గు నిల్వలు లభించడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరిగి వేలాది మంది కార్మికుల ఉపాధికి భరోసా ఏర్పడుతుందని సంధ్యారాణి తెలిపారు. ఈ నిర్ణయం సింగరేణి అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని, సంస్థ భవిష్యత్తును మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకునేందుకు కృషి చేసిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కార్మికులు తమ కృతజ్ఞతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 14న జరిగే కార్యక్రమానికి సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కందుల సంధ్యారాణి పత్రికా ప్రకటనలో పిలుపునిచ్చారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునికి జెన్కో ఉద్యోగుల సన్మానం



జ్యోతినగర్ ఎన్టిపిసి జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను జెన్కో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. శనివారం రామగుండంలోని ఎన్టీపీసీ అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డి. శ్రీనివాస్, ఎం. మల్లేష్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జెన్కోలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## మాకు న్యాయం చేయండి



హనుమకొండ/ధర్మసాగర్/ జులై 11/అక్షరం న్యూస్

మా భూమి మాకు ఇప్పించి న్యాయం చేయాలని వైఎస్ఆర్ ఆకారపు రాజమ్మ, రాజమల్లు వెంకట్ స్వామి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శనివారం మండలంలోని పెద్ద పెండ్యాల గ్రామంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన ఆకారపు రాజయ్య, రాచమల్లు వెంకటస్వామి 2001లో అదే గ్రామానికి చెందిన రాజారపు కొమురయ్య వద్ద సర్వే నెం.142లో 10 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి సాగు చేస్తున్నామని చెప్పారు.తాజాగా కొమురయ్య కుమారుడు రాజారపు విజయ్ తమకు తెలియకుండా ఆ భూమికి తన పేరుతో పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. 2001లో డబ్బులు ఇచ్చి అగ్రిమెంట్ పత్రాలు ఉన్నప్పటికీ, అప్పట్లో ఆర్ ఓ ఆర్ లో కొన్ని అవకతవకల వల్ల పట్టా రాలేదని, ఇప్పుడు డబ్బు పలుకుబడితో విజయ్ పట్టా చేసుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై సర్పంచ్, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగి రూ.3 లక్షలు ఇవ్వాలని నిర్ణయించిన తాను అంగీకరించలేదని,దీంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు. గత 25 ఏళ్లుగా తామే సాగు చేస్తున్నామని,పోలీసులు కూడా విచారణ పూర్తయ్యే వరకు విజయ్ భూమిలోకి వెళ్లవద్దని చెప్పారని వివరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## జ్యోతి గాంధీ స్మారక పురస్కారం ప్రదానం చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: మహిళా మణికి జ్యోతి గాంధీ స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం గోదావరిఖనిలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. అనంతరం జ్యోతి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడంలో రైజింగ్ తెలంగాణ సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ, అదే తరహాలో గాంధీగిరి వార్తలు కూడా వేగవంతంగా, ప్రజలకు చేరువగా వార్తలను అందిస్తున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ విశ్వసనీయ వార్తా వేదికగా ఎదుగుతున్న గాంధీగిరి వార్తల నిర్వాహకుడు దయానంద్ గాంధీని అభినందించారు.స్థానిక యువత వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి గోదావరిఖని ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి: కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: రామగుండం నగర పాలక సంస్థ 21వ డివిజన్ లక్ష్మీపురం ప్రాంతంలోని బూత్ నంబర్--230 పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఓటరు ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటును భద్రపరుచుకోవాలని సూచించారు. ఇంటింటికీ వచ్చే బూత్ స్థాయి అధికారులకు అవసరమైన వివరాలు, పత్రాలను అందించి ఓటర్ల జాబితాలో తమ వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సహకరించాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి విలువైనదని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బడుగు శ్రీనివాస్, కొలిపాక కనకరాజు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మాల్యాలపల్లి--బద్రిపల్లి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి నిర్మించాలి



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

రామగుండం నుంచి గోదావరిఖని కోల్ మైన్ సైడింగ్‌కు వెళ్లే మార్గంలోని మాల్యాలపల్లి--బద్రిపల్లి గ్రామాల ప్రజల రాకపోకల సౌకర్యం కోసం రైల్వే గేటు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనుమస శ్రీనివాస్ జీన్స్ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాల్యాలపల్లి, బద్రిపల్లి గ్రామాల ప్రజలు ప్రతిరోజూ రైల్వే పట్టాలు దాటి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు తరచూ రైల్వే గేటు వద్ద ఎక్కువసేపు నిలిచిపోవడంతో ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ప్రాణాలను పణంగా పెట్టి రైళ్ల కింద నుంచి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత రైల్వే గేటు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైల్వే శాఖ అధికారులతో సమన్వయం చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్లమెంట్ సభ్యుడిని విజ్ఞప్తి చేశారు.

## గోదావరిఖని బస్టాండ్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : గోదావరిఖని బస్టాండ్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. బస్టాండ్‌లో ఆధునిక ప్లాట్‌ఫారమ్‌లు, ప్రత్యేక ఆటో స్టాండ్, ఆటో డ్రైవర్లకు అవసరమైన సౌకర్యాలు, ఫుట్‌పాత్‌లు, తాగునీరు, పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్టాండ్‌ను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య , సింగరేణి జనరల్ మేనేజర్, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీపురం--పోతన కాలనీ రహదారి నిర్మాణానికి శ్రీకారం..





- **ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్‌కు ఘన సన్మానం**

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: లక్ష్మీపురం గేటు వద్ద మహాత్మా గాంధీ విగ్రహం నుంచి పోతన కాలనీ సింగరేణి కారిడార్ రహదారి వరకు నూతన రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కావడం, అలాగే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియామకం పొందిన సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్, కొక్కిరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కందుల సతీష్, వేణుగోపాలరావు, మహమ్మద్ గౌస్, ఇరుకుల సంతోష్, కె. అశోక్, రఘు తదితరులు పాల్గొన్నారు

# సింగరేణి అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శనివారం పరిశీలించారు.




పనులు నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముందుగా ఫోర్‌క్లెయిన్ ప్రాంతంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మశానవాటికల అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్‌బీ నగర్, జవహర్ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందేలా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే గోదావరి తీరంలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక శవదహన కేంద్రాన్ని పరిశీలించి, ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

# 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాం..

- **ఇప్పటివరకు 11 వేల కోట్ల వరకు ఉచిత బస్ ప్రయాణాలు జరిగాయి.**
- **ప్రతి గ్రామానికి =ుజ బస్సులు నడపాలనేది ప్రభుత్వ లక్ష్యం**

సూర్యాపేట/ కోదాడ/జులై 11(అక్షరం న్యూస్)

రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

.తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుజుర్నగర్ లో 3.52కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న బస్సు స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 3.52 కోట్ల రూపాయలతో బస్సు స్టేషన్ నిర్మాణం చేసుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని, తెలంగాణ వ్యాప్తంగా 10,173 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుందని, 35 లక్షల మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేస్తున్నారని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించడం ద్వారా ఇప్పటివరకు 326 కోట్ల ప్రయాణాలు పూర్తయ్యాయని,

మహిళలకు 11,400 కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూర్చామని అన్నారు. మహిళా సంఘాలకు 600 బస్సులను అందించి ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

తదుపరి ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యంతో పాటు, మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. హుజూర్‌నగర్ లో బస్టాండ్




నిర్మాణంతో ప్రయాణాలు మరింత సులభతరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత పట్టణ ప్రజలు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి పాఠశాలకు రూ.50 వేల వాటర్ కూలర్ దాతల కానుక..

- **విద్యార్థులకు చల్లని తాగునీటి సౌకర్యం**
- **రూ.50 వేల వాటర్ కూలర్ ఏర్పాటు..**
- **ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు**
- **విద్యార్థుల దాహం తీర్చిన దాతలు..**

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 11/అక్షరం న్యూస్:-

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.50 వేల విలువైన 80 లీటర్ల సామర్థ్యం గల బ్లూ స్టార్ వాటర్ కూలర్‌ను శనివారం దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమానికి మార్పాటి వెంకట రాజిరెడ్డి, మార్పాటి జయప్రకాశ్ రెడ్డి, మార్పాటి ప్రదీప్ రెడ్డి, మార్పాటి ప్రవీణ్ రెడ్డి ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దాతలు అందించిన ఈ సహాయం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. సమాజంలో మరింత మంది దాతలు ప్రభుత్వ పాఠశాలల



అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం దాతలను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, ప్రదీప్ కుమార్, రాజేంద్రం, మోహన్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు కూడా దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు

## ముల్కనూర్ లో బండి సంజయ్ జన్మదిన వేడుకలు..

- కొత్తకొండ వీరభద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు ముల్కనూర్‌లో కేక్ కటింగ్ మిఠాయిల పంపిణీ-బీజేపీ శ్రేణుల సంబరాలు..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 11/అక్షరం న్యూస్:-

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు విశేష పూజలు నిర్వహించి. బండి సంజయ్ ఆయురారోగ్యాలతో దేశ సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముల్కానూర్ అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకోవడంతో చౌరస్తా పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయిఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆశీస్సులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో బండి సంజయ్ దేశానికి ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. భీమదేవరపల్లి మండల ప్రజలు పార్టీ కార్యకర్తల మద్దతు ఆయనకు ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, రసూల్‌పల్లె సర్పంచ్ బోయినీ మహేష్, గుండెల్లి సదానందం, పయ్యావుల రాజు, కంకణ సదానందం, మేకల రాజు, తీగల రాజు, లక్కిరెడ్డి మల్లారెడ్డి, ములుగు సంపత్, రామారావు భద్రయ్య, అయిత సాయి తేజ, దొంగల రానా ప్రతాప్, బొల్లంపల్లి శ్యామ్, సింగం రాజేందర్, శనిగరపు ఐలయ్య, రామారావు అర్జున్, గణేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం.. ఇంటింటికీ వెళ్లని బీఎల్వోలు: సీపీఎం ఆరోపణ



సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 11: అక్షరం న్యూస్:

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియలో బీఎల్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం నేరేడుచర్ల పట్టణ కార్యదర్శి కొదమ గుండ్ల నగేష్ ఆరోపించారు. జూన్ 25న ప్రారంభమైన ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందించాల్సి ఉన్నప్పటికీ, బీఎల్వోలు అలా చేయడం లేదన్నారు. టెంట్లు ఏర్పాటు చేసి ఒకేచోట కూర్చొని అక్కడికి వచ్చిన వారికి మాత్రమే ఫారాలు అందిస్తున్నారని విమర్శించారు. దీంతో తమ ఎన్యుమరేషన్ ఫారం ఏ బీఎల్వో వద్ద ఉందో తెలియక ప్రజలు ఒకరి వద్ద నుంచి మరొకరి వద్దకు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 25 నుంచి జూలై 25 వరకు ప్రతి ఇంటిని మూడుసార్లు సందర్శించాల్సి ఉండగా, ఇప్పటికే 15 రోజులు గడిచినా అనేక ఇళ్లకు బీఎల్వోలు వెళ్లలేదని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి బీఎల్వోలను ఇంటింటికీ పంపించి, కొత్తగా జారీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను నింపించి సేకరించేలా చర్యలు తీసుకోవాలని నగేష్ కోరారు. లేకపోతే పట్టణంలో పలువురు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టండి.. భూగర్భ జలాలను పరిరక్షించండి...



సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 11: అక్షరం న్యూస్:

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి ఆవరణ, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ప్రార్థనా మందిరాలు తదితర ప్రాంగణాల్లో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పరిరక్షించాలని నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "జల ప్రమాణం" కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించేందుకు వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకించే విధంగా రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు తాగునీటి కొరత తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఇంటి యజమాని, సంస్థ ప్రతినిధి వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు ముందుకు రావాలని, పట్టణాన్ని నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలపాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించి పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి వనరులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



# కృత్రిమ మేధస్సు దిశగా పీఎంశ్రీ విద్యార్థుల తొలి అడుగు..







- **సూపర్ ఏఐతో రేపటి సాంకేతిక ప్రపంచానికి విద్యార్థుల సన్నద్ధం**

సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 11: అక్షరం న్యూస్

పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నేరేడుచర్లలో జూలై 6 నుంచి 11 వరకు నిర్వహించిన సూపర్ ఏఐ శిక్షణ కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ అవగాహన, కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ఆసక్తి పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, కృత్రిమ మేధస్సు అంటే ఏమిటి, చాట్‌జీపీటీ, స్క్రాచ్ వంటి ఆధునిక ఏఐ, కోడింగ్ సాధనాల వినియోగంపై ప్రాయోగికంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కొత్త సాంకేతిక అంశాలను ఆసక్తిగా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తూ సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నేటి డిజిటల్ యుగంలో ఏఐ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ఫైబర్ ఆధ్వర్యంలో అందించిన సూపర్ ఏఐ ధ్రువపత్రాలను ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, ఏఏపీసీ చైర్‌పర్సన్ ఇంజమూరి శ్రావణి విద్యార్థులకు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న సూపర్ ఏఐ కార్యక్రమాన్ని అందరికీ చేరువ చేసినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం లభించడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫైబర్ ప్రతినిధి రాహుల్, సూపర్ టీచర్ బృందం సభ్యుడు ధీరజ్, శిక్షకులు నానిబాబు, రవితేజ పాల్గొని విద్యార్థులను అభినందించారుకార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, అతిథులు, విద్యార్థులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యం..

## నాలుగు గంటల్లో రెండు సురక్షిత సాధారణ ప్రసవాలు

- **ప్రభుత్వ ఆసుపత్రిలో మరో ఘనత.. నాలుగు గంటల్లో ఇద్దరు మగ శిశువుల జననం**



సూర్యాపేట/నేరేడుచర్ల, జూలై 11: అక్షరం న్యూస్:

నేరేడుచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరోసారి నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ విశ్వాసాన్ని చాటుకుంది. వైద్యాధికారి డా. పున్న నాగిని నేతృత్వంలోని వైద్య బృందం ఒకే రోజు శనివారం కేవలం నాలుగు గంటల వ్యవధిలో రెండు సురక్షిత సాధారణ ప్రసవాలు నిర్వహించి తల్లి, శిశువుల ఆరోగ్యాన్ని కాపాడింది. మొదటి ప్రసవం దర్శనచర్ల గ్రామానికి చెందిన శ్రీకన్యకు జరిగింది. పురిటి నొప్పులతో ఆసుపత్రికి చేరుకున్న ఆమెకు వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహించి సాయంత్రం 6 గంటలకు సురక్షితంగా సాధారణ ప్రసవం చేయగా, 3.5 కిలోల బరువున్న పండంటి మగబిడ్డ జన్మించాడు. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అదే రోజు పాలకవీడు మండలం అలింగపురం గ్రామానికి చెందిన అంజలి మూడో కాన్పు కోసం ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్యులు అవసరమైన పరీక్షలు పూర్తి చేసి రాత్రి 9.45 గంటలకు సురక్షితంగా సాధారణ ప్రసవం నిర్వహించారు. ఆమె కూడా 3.5 కిలోల బరువున్న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మొదటి రెండు కాన్పుల్లో ఆడపిల్లలు జన్మించిన అంజలి దంపతులకు మూడో కాన్పులో మగబిడ్డ జన్మించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. పున్న నాగిని మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ సహకారం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోత్సాహంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి సేవలకు అవసరమైన ఆధునిక పరికరాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణులు ప్రసవ సమయం సమీపించగానే ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత, సురక్షిత ప్రసూతి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. నేరేడుచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలను స్థానిక ప్రజలు అభినందిస్తూ, వైద్యాధికారి డా. పున్న నాగినితో పాటు వైద్య బృందాన్ని ప్రశంసించారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు విద్యనే బలమైన పునాది





- **బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్.**
- **సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన సీఐ రమేష్.**
- **విద్యా సామాగ్రి అందజేసిన అమ్మ ఆదర్శం యూత్.**

మంచిర్యాల జిల్లా/మందమర్రి/ జూలై 11/అక్షరం న్యూస్ -:

విద్యార్థుల భవిష్యత్తుకు విద్యనే బలమైన పునాది అని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ అన్నారు. విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా అమ్మ ఆదర్శం యూత్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఒర్రెగడ్డ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 200 మందికి పైగా విద్యార్థులకు రూ.30 వేల విలువైన విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో విద్యకు మించిన సంపద లేదని పేర్కొన్నారు. అనంతరం మందమర్రి సీఐ పర్స రమేష్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. అమ్మ ఆదర్శం యూత్ వ్యవస్థాపకులు బండారి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడం, నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప పోలీసు అధికారులు గోపతి నరేష్, శ్రీధర్, అమ్మ ఆదర్శం యూత్ సభ్యులు సాతిని సంజీవ్, సిద్దర్ల రాహుల్, విరుగురాల వినయ్, గంధం సంతోష్, గాదె మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

- అనర్హులు ఉంటే అధికారులకు చెప్పండి.
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూలై 11/ అక్షరం న్యూస్ –:
అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని ఏమైనా అవకతవకలు ఉంటే అధికారులను సంప్రదించాలి కానీ బిఆర్ఎస్ నాయకులు చిల్లర ఆరోపణలు చేయడం ఏంటని మందమర్రి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. మీ హాయంలో జరిగిన పొరపాట్లు జరగకుండా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులకు సూచించారని తెలిపారు. పార్టీల వ్యక్తులను చూడకుండా కేవలం నిరుపేదలకి కేటాయించడం జరిగిందన్నారు. గతంలో మీరు పంచిన ఇల్లు కేవలం మీ కార్యకర్తలకు ఇచ్చారని దళిత బంధు, బీసీ బందు, మైనారిటీ బందు, ఎంతమంది నిరుపేదలకు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేసారు. మేము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కేవలం పేదల కోసమేనని మీరు చేపట్టిన కార్యక్రమాలు కేవలం మీ కార్యకర్తల కోసమేనని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో, పత్రిక సమావేశాలలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులకు బహిరంగ చర్చకు సిద్ధమా ? అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ సవాల్ విసిరారు. కేవలం ఉనికి కోసమే చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మీ పార్టీకి కాలం చెల్లిందని మీకు భవిష్యత్తు లేదని అర్థమయ్యే ఇలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో నిరుపేదలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందుతాయని వారు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల విషయంలో టిఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్, మాజీ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, దుర్గం ప్రభాకర్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు ఎం.డి పాషా, పట్టణ ఉపాధ్యక్షులు రాచర్ల గణేష్, వనం నరసయ్య, మాయ రమేష్, చిప్పకుర్తి శశిధర్, సట్ల సంతోష్, రాయబారపు కిరణ్, పట్టణ మహిళ అధ్యక్షురాలు గడ్డం రజిత, కవిత లు పాల్గొన్నారు.

## సీఎంఓఏఐ అధికారుల దీక్షకు సంఘీభావం

- మద్దతు తెలిపిన బీసీ సంఘం నాయకులు.



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జులై 11/ అక్షరం న్యూస్ –:
సింగరేణి అధికారుల సంఘం సీఎంఓఏఐ ఆధ్వర్యంలో చేస్తున్న 13వ రోజు రిలే నిరాహార దీక్షకు బీసీ అసోసియేషన్ మందమర్రి ఏరియా సభ్యులు శనివారం అధికారులకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ మందమర్రి లోని జీఎం కార్యాలయం సమీపంలో అధికారులకు న్యాయబద్ధంగా రావాల్సిన పిఆర్పి పిఆర్సి చెల్లించాలని గత 13 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారన్నారు. ఈ న్యాయమైన డిమాండ్ ను చెల్లించాలని లేనియెడల భవిష్యత్తులో సి ఎం ఓ ఏ ఐ సభ్యులు తీసుకునే నిర్ణయాలకు బిసి అసోసియేషన్ పూర్తి మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. సీఎంఓ ఏఐ అధికారుల అధ్యక్షుడు సొత్కూరి రమేష్ అధికారులు బీసీ సంఘం నాయకులు మద్దతు తెలిపినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మద్దెల శంకర్, ఏరియా నాయకులు కొట్టే రమేష్, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, అలవాల బాపురావు, గాండ్ల సంపత్, బీమారి వెంకటేష్, అందే శ్రీకాంత్, జితేందర్
సల్ల వెంకటేష్, బి. కార్తీక్, ఖాదర్, రామ సాయి కృష్ణ, సందీప్, వివిధ గనుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ సభ్యుడు హర్కర వేణుగోపాల్ రావుకు కీలక బాధ్యతలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చేపట్టిన సంస్థాగత బలోపేత కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కోసం ప్రత్యేక పరిశీలకులను నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ విడుదల చేసిన ప్రకటనలో, తెలంగాణకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావును కర్ణాటకలోని విజయనగర సంస్థాగత జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడిగా నియమించారు. పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించడం, స్థానిక నాయకులతో సమన్వయం చేసి ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం వంటి కీలక బాధ్యతలను హర్కర వేణుగోపాల్ రావు నిర్వహించనున్నారు. తెలంగాణకు చెందిన నాయకుడికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# నాయకుల విభేదాల మధ్య నష్టపోతున్న ముదిరాజ్ సమాజం




ఓదెల/ పెద్దపల్లి జులై 11(అక్షరం న్యూస్)
తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాల్లో జనాభా పరంగా, సామాజికంగా బలమైన వర్గాల్లో ముదిరాజ్ సమాజం ఒకటి. అయినప్పటికీ, రాజకీయ ప్రాతినిధ్యం, నామినేటెడ్ పదవులు, కీలక నిర్ణయాత్మక స్థానాల విషయంలో ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కడం లేదనే భావన ముదిరాజ్ సమాజంలో బలంగా వ్యక్తమవుతోంది.

### ఐక్యత లోపం -- బీసీ-ఎ దూరంలి

ముదిరాజ్ సమాజం దశాబ్దాలుగా బీసీ–ఏ వర్గీకరణ కోసం పోరాటం చేస్తూనే ఉంది. అయితే రాజకీయంగా ప్రభావం కలిగిన నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం కూడా ఈ డిమాండ్ ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడానికి ఒక ప్రధాన కారణమనే అభిప్రాయం సమాజంలో వ్యక్తమవుతోంది.
సమాజ ప్రయోజనాల కోసం ఒకే వేదికపై నిలబడి, ఉమ్మడి కార్యాచరణతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయంలో నాయకత్వం విభజనలో ఉండడం వల్ల బీసీ–ఏ సాధన ఇప్పటికీ అందని ద్రాక్షలా మారిందనే భావన పలువురిలో కనిపిస్తోంది.
బీసీ–ఏ హోదా లేకపోవడం వల్ల ముదిరాజ్ యువత, విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆశించిన అవకాశాలను కోల్పోతున్నారనే ఆవేదన ఉంది. ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది యువకులు రోజువారీ కూలీలుగా, తాపీ మేస్త్రీలుగా, ఆటో డ్రైవర్లుగా, పట్టణాల్లో అపార్ట్‌మెంట్‌లలో వాచ్‌మెన్‌లుగా, ఇతర అసంఘటిత రంగాల్లో ఉపాధి కోసం పనిచేయాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి మారాలంటే వ్యక్తిగత విభేదాలు, రాజకీయ భిన్నాభిప్రాయాలు, వర్గపోరాటాలను పక్కనపెట్టి, శ్రీ వాకిటి శ్రీహరి ముదిరాజ్ , శ్రీ నీలం మధు ముదిరాజ్ , శ్రీ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సమాజ ప్రయోజనాల కోసం ఒకే వేదికపై నిలబడి, బీసీ–ఏ సాధన కోసం సమిష్టిగా గొంతెత్తాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐక్య ఉద్యమం ద్వారానే ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగే అవకాశాలు మరింత బలపడతాయి.

### "ముగ్గురు కలవరు -- ముదిరాజులకు పదవులు రావు"

"ముగ్గురు కలవరు –– ముదిరాజులకు పదవులు రావు" అనే వ్యాఖ్య కేవలం ఒక సామెతలా కాకుండా, నేటి పరిస్థితిపై వినిపిస్తున్న రాజకీయ విశ్లేషణగా మారింది. సమాజంలో ప్రభావం కలిగిన నాయకులు ఒకే వేదికపై నిలవకపోవడం, వ్యక్తిగత విభేదాలు, రాజకీయ భిన్నాభిప్రాయాలు, వర్గపోరాటాలు సమాజ ప్రయోజనాల కంటే ముందుకు రావడం వల్ల సామూహిక శక్తి బలహీనపడుతోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

### "ఒకరు గోరుకోలు -- వ ు ం ొ క ౦ ు మూలచుక్క

"ఒకరు గోరుకోలు –– మరొకరు మూలచుక్క"
అనే మన భాషలోని సామెత, "తూర్పు–– పడమర" అన్నట్లుగా ఒకే లక్ష్యం కోసం కలిసి నడవాల్సిన నాయకత్వం పరస్పరం భిన్న దిశల్లో సాగితే, దాని ప్రభావం మొత్తం సమాజంపైనే పడుతుంది. రాజకీయంగా బలమైన వర్గంగా ఎదగాలంటే వ్యక్తిగత విభేదాల కంటే సామాజిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### "అన్నీ ఉన్నవి అల్లుడి నోట్లో శని"

"అన్నీ ఉన్నవి అల్లుడి నోట్లో శని"
అన్న సామెత కూడా ఈ సందర్భంలో వర్తిస్తుంది. జనాభా ఉంది, ఓటు బ్యాంకు ఉంది, సామాజిక బలం ఉంది, చరిత్ర ఉంది, పోరాట స్ఫూర్తి ఉంది. కానీ ఆ బలాన్ని రాజకీయ అవకాశాలుగా మార్చుకునే ఐక్యత లోపిస్తే, ఉన్న శక్తి కూడా ప్రయోజనం లేకుండా పోతుంది. నాయకుల మధ్య కోపతాపాలు, ఆధిపత్య పోటీలు, పరస్పర విమర్శలు కొనసాగితే చివరకు నష్టపోయేది ఒక్క నాయకుడు కాదు–– –మొత్తం ముదిరాజ్ సమాజమే. నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ స్థానాలు, శాసనసభ లేదా పార్లమెంట్ అవకాశాలు, ప్రభుత్వ కమిటీల్లో ప్రాతినిధ్యం వంటి అంశాల్లో సమాజం ఆశించిన ఫలితాలు దక్కకపోవడానికి అంతర్గత విభేదాలు కూడా ఒక కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు కూడా ఒక సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే ఆ వర్గానికి తగిన ప్రాధాన్యం ఇస్తాయి. నాయకత్వం విభజనలో ఉంటే, ఆ సమాజం రాజకీయ బేరసారాల శక్తిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే ముదిరాజ్ సమాజం భవిష్యత్తు కోసం నాయకులంతా వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి, ఒక ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగితేనే రాజకీయంగా, సామాజికంగా మరింత బలపడే అవకాశం ఉంటుంది.

### హామీల జాప్యం -- కాంగ్రెస్‌కు నష్టం

2023 శాసనసభ ఎన్నికలకు ముందు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ ముదిరాజ్ ఆత్మగౌరవ సభలో ముదిరాజ్ సమాజం ఐక్యంగా తమ రాజకీయ వైఖరిని ప్రకటించింది. ఆ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది.
ఆ నిర్ణయానికి అనుగుణంగానే రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో ప్రభావం చూపగలిగే ముదిరాజ్ ఓటర్లు కాంగ్రెస్ పార్టీ విజయానికి తమ వంతు సహకారం అందించారనే అభిప్రాయం సమాజంలో ఉంది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సమాజం ఆశించిన స్థాయిలో నామినేటెడ్ పదవులు కల్పించకపోవడం, కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన బీసీ–ఏ హామీ ఇప్పటికీ అమలుకాకపోవడం వల్ల సమాజంలో అసంతృప్తి పెరుగుతోందనే భావన వ్యక్తమవుతోంది. అంతేకాకుండా, ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పదవివిషయంలో కూడా ముదిరాజ్ సమాజానికి తగిన ప్రాధాన్యం దక్కలేదనే అభిప్రాయం వినిపిస్తోంది. అలాగే, గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ అధికారుల కమిటీ చేసిన సిఫార్సులు కూడా పూర్తిస్థాయిలో అమలుకాలేదనే విమర్శలు ఉన్నాయి.
ఈ పరిణామాలన్నీ కలిపి ముదిరాజ్ సమాజంలో కాంగ్రెస్ పార్టీ పట్ల వ్యతిరేక భావన పెరిగే పరిస్థితికి దారితీస్తున్నాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో లిరాష్ట్ర మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి ముదిరాజ్ , మెదక్ పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ నీలం మధు ముదిరాజ్ , తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వ్యక్తిగత భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి ఒకే వేదికపైకి వచ్చి, ముదిరాజ్ సమాజం సమస్యలు, ముఖ్యంగా బీసీ–ఏ అమలు, రాజకీయ ప్రాతినిధ్యం, నామినేటెడ్ పదవులు వంటి అంశాలపై సమిష్టిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళితే, అది ముదిరాజ్ సమాజానికే కాకుండా కాంగ్రెస్ పార్టీకి కూడా రాజకీయంగా మేలు చేస్తుందని భావించవచ్చు. లి
ముదిరాజ్ సమాజం ఆశలు నెరవేరితేనే నమ్మకం బలపడుతుంది.

### హామీల అమలే రాజకీయ విశ్వాసానికి పునాది.

నాయకుల ఐక్యతే ముదిరాజ్ జాతి భవిష్యత్తుకు బలమైన పునాది.
బీసీ–ఏ సాధనకు సమిష్టి పోరాటమే మార్గం. ఐక్యతే బలం –– ఐక్యతే రాజకీయ గౌరవానికి మార్గం.

### తాడిచర్ల--2 బ్లాక్ విజయోత్సవాలు ఘనంగా

# నిర్వహించిన సింగరేణి రామగుండం ఏరియా--1






జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూలై 11 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
: తాడిచర్ల––2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంతో సింగరేణి రామగుండం ఏరియా––1 పరిధిలో శనివారం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జీడీకే––1ఽ3 ఇంక్లైన్ గనితో పాటు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం, అన్ని గనులు, విభాగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగులు, కార్మికులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.
జీడీకే––1ఽ3 ఇంక్లైన్ గనిలో జరిగిన కార్యక్రమానికి ఏరియా––1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తాడిచర్ల––2 బ్లాక్ సాధన సింగరేణి భవిష్యత్తుకు కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశంతో కూడిన కరపత్రాలను ఉద్యోగులకు పంపిణీ చేశారు. తాడిచర్ల–– 2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణికి సుస్థిర భవిష్యత్తు లభించిందని, సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, సాంకేతిక అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సందేశంలో పేర్కొన్న అంశాలను వివరించారు.
వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. హాజరైన అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు.
కార్యక్రమంలో రామగుండం రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ సుజోయ్ మజుందార్, ఎస్ఓ టు జీఎం చంద్రశేఖర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, జీడీకే––1 గ్రూప్ ఏజెంట్ ఎల్. రమేష్, 11 గ్రూప్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఓసీ–– 5 ప్రాజెక్టు అధికారి రమేష్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీఎంఓఏఐ ఏరియా ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల శ్రీనివాస్, సీనియర్ ప్రాజెక్టు అధికారి హనుమంతరావు, జీఎం కార్యాలయ ఇన్‌చార్జి రాజు, జీఎం కార్యాలయ ఉద్యోగులతో పాటు ఆర్జీ––1 పరిధిలోని జీడీకే––1, 2, 2ఏ, 11 ఇంక్లైన్ గనులు, ఓసీ––5 అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.





## గడ్డం వినోద్ వెంకటస్వామి ని కలిసిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 11 / : మాజీ మంత్రి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కి యాదాద్రి ధర్మకర్తగా ప్రమాణ స్వీకారానికి వీచేసిన సందర్భంగా కలవడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న యాదగిరిగుట్ట మాజీ దేవస్థానం ధర్మకర్త పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ , యాదగిరిగుట్ట కాంగ్రెస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్ , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చిమట్ల మనోజ్ గౌడ్ కలవడం జరిగింది.

## తుర్కపల్లి మండల పి.ఏ.సి.ఎస్ చైర్మన్ ధానవత్ శంకర్ నాయక్ కు ఘన సన్మానం



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 11 / : నూతనంగా పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్‌గా నియమితులైన "ధనావత్ శంకర్ నాయక్" ని డైరెక్టర్ సుదర్శన్ గౌడ్ ను శనివారం గుజ్జవానికుంట తండా సర్పంచ్ గూగులోత్ దూప్ సింగ్ నాయక్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు శంకర్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

?ఈ కార్యక్రమంలో ఛోక్ల తండ సర్పంచ్ భూక్యా రాజారాం నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు బాస్కర్ నాయక్ , గుజ్జవానికుంట తండా గ్రామ శాఖ అధ్యక్షులు గూగులోత్ చందర్, వేల్పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జేరిపోతుల నరేందర్, మరియు వేల్పల్లి ఉపసర్పంచ్ ఏనుగు సిద్ధులు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు అభినందనలు తెలియజేశారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు...

## ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి

- మున్సిపల్ కౌన్సిలర్ ఈర్ల స్వరూప-సురేందర్.
- 7వ వార్డులో ముమ్మరంగా ఓటర్ల జాబితా సవరణ.



పెద్దపల్లి జిల్లా /పెద్దపల్లి టౌన్ /జూలై 11/ అక్షరం న్యూస్ -:

పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ-ఎస్ఐఆర్- 2026 అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా 7వ వార్డులో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను అధికారులు, ప్రజాప్రతినిధులు వేగవంతం చేశారు. 7వ వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వరూప-సురేందర్ గత వారం రోజులుగా బూత్ స్థాయి అధికారులతో కలిసి వార్డులో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్ల నమోదు,చిరునామా మార్పులు,అభ్యంతరాల తొలగింపుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు ఫారమ్‌లను నింపడంలో ప్రజలకు సిబ్బంది ప్రత్యక్షంగా సహకరిస్తున్నారు.ఈ ప్రత్యేక నమోదు ప్రక్రియను పర్యవేక్షించేందుకు శనివారం పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,తహసిల్దార్ రాజయ్య 7వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఈర్ల స్వరూప-సురేందర్ వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం అధికారులతో కలిసి ఆమె ఇంటింటికీ తిరుగుతూ, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ స్వరూప మాట్లాడుతూ ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు హక్కు అత్యంత కీలకమైనది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026లో భాగంగా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి పౌరుడు తమ వివరాలను నమోదు చేసుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలి అని పిలుపునిచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించడానికి జూలై 24ను గడువుగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు రజిత, ఉమారాణి, వార్డు ఆఫీసర్ అశ్విత, వార్డునాయకులు కట్ల అన్వేష్, అనాజ్ ఈశ్వర్, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి...





- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.
- భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వేనే కీలకం.
- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయాలి.
- రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 60 చెల్లింపు.
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి.
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలి.
- ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందించాలి.
- భూ రీ-సర్వే, ఇందిరమ్మ ఇండ్లు, సాదా బైనామా దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జూలై 11 / అక్షరం న్యూస్ -:

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు.ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు.

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు.

తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు.

రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది,పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు.ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువిచ్చి, గడువులోగా చేరని వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. లైసెన్స్ సర్వేయర్లకు బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరిత గతిన జారీ చేయాలని సూచించారు.

పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండవ విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలని, రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి-2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు.సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతివిద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు.జిల్లాలో భూ సర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ అంకిత్ మంత్రికి వివరించారు. అక్కినేపల్లి గ్రామంలో మొత్తం 8,990 ఎకరాలకు గాను సుమారు 4,900 ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. గుండాల మండలంలో సర్వే పనులు కొనసాగుతున్నాయని, పెద్దవేంకటాపురం గ్రామంలో 537 ఎకరాలు, శుభంపేట గ్రామంలో 267 ఎకరాల సర్వే పూర్తయిందన్నారు. మాదారం గ్రామంలో సోమవారం నుంచి రీ-సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకం పరిధిలో ఈ నెలలోనే 5,000 ఎకరాలకు భూ సర్వే చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 17 గ్రామాల్లో రీ-సర్వే నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని, తొలి దశలో 14 గ్రామాలను ఎంపిక చేసి పాల్వంచ, గుండాల, పినపాక, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లో సుమారు 4,000 ఎకరాల సర్వే పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు చేపట్టామని వివరించారు.జిల్లాలో మొత్తం 206 మంది లైసెన్స్ సర్వేయర్లు ఉన్నారని, వారిలో 56 మంది జిల్లాకు కేటాయించబడ్డారని కలెక్టర్ తెలిపారు. కేటాయించబడిన వారిలో ఇప్పటికే 16 మంది విధుల్లో చేరి భూ రీ-సర్వే పనులు నిర్వహిస్తున్నారని, మిగిలిన వారు కూడా త్వరలో విధుల్లో చేరనున్నట్లు వివరించారు. విధుల్లో చేరిన సర్వేయర్లకు రిటైర్డ్ సర్వేయర్ల ద్వారా అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసరావు, తాసిల్దార్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు ర్యాంపు నిర్మాణాలను కార్యక్రమం

## ప్రారంభించిన ఆలేరు మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్





యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 11 / : శనివారం రోజు ఆలేరు పట్టణం బస్టాండ్ దగ్గర వేణు కాంప్లెక్స్ పక్కన సుభాష్ నగర్ కాలనీలోకి వెళ్లే రోడ్డు గుంతలు పడి వాహనదారులకు, ప్రజలకుచాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆలేరు మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బీజన బాలమణి భాస్కర్ దృష్టి తీసుకురాగా,వారు ప్రభుత్వ ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో శనివారం రోజు సిసి రోడ్డు ర్యాంపు నిర్మాణం కార్యక్రమం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అలాగే సుభాష్ నగర్ కాలనీలోని ప్రభాకర్ హాస్పిటల్ పక్కన సిసి రోడ్డు నిర్మాణం గుంతలు పడి ప్రజలు, పేషెంట్లు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పరిశీలించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఓల్డ్ వి.ఆర్ కాలేజ్ సమీపంలో డ్రైనేజీ కాల్వలో చెత్త చెదారాలు పేరుకుని పోయి మురికి నీరు వెళ్లే విషయంలో ఇబ్బంది ఏర్పడగా డ్రైనేజీ పై ఉన్న సీసీ నిర్మాణాన్ని జెసిబి సహాయంతో తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గారు, మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు , కౌన్సిలర్లు శ్రీమతి మరియమ్మ మార్కు , శ్రీమతి మల్లెల సరిత శ్రీకాంత్ ,జూకంటి సంపత్ ,శ్రీమతి జట్ట నీరజ సిద్ధులు , మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు చింతకింది మురళి ,శ్రీమతి శమంతక రెడ్డి ,ఆలేరు కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ ఇజాజ్ ,డాక్టర్ ప్రభాకర్ , తమ్ముడి పద్మారావు, యాట పద్మ , కాలనీవాసులు పాల్గొన్నారు.

## ముప్పి గ్రామంలో నకిలీ అటవీ అధికారులకు దేహశుద్ధి!

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, జూలై 11(అక్షరం న్యూస్ ) మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ముప్పి గ్రామంలో అర్ధరాత్రి తీవ్ర కలకలం రేగింది. అటవీ శాఖ అధికారులమంటూ నకిలీల పేరుతో గ్రామంలోకి ప్రవేశించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.?అసలేం జరిగిందంటే..గ్రామస్తుల కథనం ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు ఆగంతుకులు ముప్పి గ్రామానికి వచ్చారు. తాము అటవీ శాఖ (ఫారెస్ట్) అధికారులమని, ఇళ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన కలప, ఇతర అటవీ ఉత్పత్తులపై తనిఖీలు చేయడానికి వచ్చామని చెబుతూ హల్చల్ చేశారు.అయితే, అర్ధరాత్రి వేళ అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పాటు, వారి గుర్తింపు కార్డుల (ఐడీ కార్డులు) విషయంలో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. వారిని గట్టిగా నిలదీయడంతో ఆగంతకులు పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు సదరు నకిలీ అధికారులకు గట్టిగా దేహశుద్ధి చేశారు.

పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది...

ఈ ఘటనపై అటవీ శాఖ ఉన్నతాధికారులు కానీ, స్థానిక పోలీసులు కానీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అసలు వారు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అనే పూర్తి వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రఘునాథపల్లి ఎంపివో సస్పెన్షన్....


జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 11: రఘునాథపల్లి మండల పంచాయతీ అధికారి మల్లికార్జున్ ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జున్ 2025లో బచ్చన్నపేటలో ఎంపివోగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో పంచాయతీ కార్యదర్శుల నుండి చట్ట విరుద్ధంగా డబ్బులు వసూలు చేశారని. రుజువులతో పలు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శులు అప్పటి కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయం పై ప్రస్తుత కలెక్టర్ కు కొందరు ఫిర్యాదు చేయగా, త్వరితగతిన విచారణ చేపట్టి మల్లికార్జున్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

## రోడ్డు పక్కన పడిపోయి యువకుడి మృతి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూలై 11: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువకుడు తిరుపతి నుండి ట్యాక్సీ కారులో వస్తూ బహిర్భూమి కోసం రఘునాథపల్లి మండల కేంద్రంలో కారును ఆపి రోడ్డు పక్కకు వెళ్తున్న క్రమంలో కింద పడిపోయి స్పృహ కోల్పోవడంతో జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు.పోలీసుల కథనం ప్రకారం.. కాజీపేట సోమిడి గ్రామం తిలక్ నగర్ కు చెందిన సోమ సురేందర్ (36) గత రెండు నెలల నుండి తిరుపతిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. సురేందర్ మద్యానికి బానిసగా మారడంతో కొడుకు పుట్టిన తర్వాత భార్య విడాకులు ఇచ్చి వెళ్లిపోయింది. దీంతో కొడుకును కాజీపేట సోమిడి తిలక్ నగర్ లో తన తల్లిదండ్రి దగ్గర ఉంచి, తిరుపతికి వెళ్లి ఒక ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. తిరుపతిలో ఉంటున్న సురేందర్ తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తిరుపతి నుండి ట్యాక్సీ కారు తీసుకొని కాజీపేటకు వస్తున్న క్రమంలో రఘునాథపల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే బహిర్భూమికి వెళ్లాలి.. కారు ఆపమని డ్రైవర్ ను కోరగా, ఆపిన కారు నుండి దిగి రోడ్డు పక్కకువెళ్తూ ఆకస్మాత్తుగా కింద పడి పోయాడు. వెంటనే కారు డ్రైవర్ అంబు ఖలీలేష్ 108కు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. 108లో జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి సోమ జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా కేంద్రమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు



చిగురుమామిడి/జూలై 11, అక్షరం న్యూస్,

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిగురు మామిడి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో కేక్ కట్ చేసి, మిఠాయి పంచిపెట్టారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రోగులకు పండ్లు బ్రెడ్ ,పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి,బి.జే.పి . ఎస్ జిల్లా అధ్యక్షులు సంపత్ , అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్,జిల్లా కార్యవర్గ సభ్యులు చెప్యాల మురళీ మనోహర్,మాజీ మండల అధ్యక్షులు పైడిపెల్లి శ్రీనివాస్ అచ్చ రవీందర్ ఓబీసీ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు ముంజ చంద్రయ్య మాజీ ఉపసర్పంచ్ బుద్ధర్తి మహేందర్ కంది శంకర్ బుర్ర శ్రీనివాస్ భీమర లక్ష్మణ్, మోహన్ రెడ్డి విశ్వకర్మ సెల్ మండల కన్వీనర్ గొల్లపెల్లి సదా చారి ,కాసాని సతీష్ బరిగేలా మోహన్ నడిగొట్టు కిరణ్ అరిగేలా రాజయ్య రాజేందర్ సిద్దెంకి అనిల్ ఎన్నం సంతోష్ పెసరి హరీష్ తుల్లెల వెంకటేష్ స్వమకూర శేఖర్ రెడ్డి దొంత కర్ణకర్ పెండ్యాల రాజేందర్ కయ్యం రజనీకాంత్ నరేందర్ రెడ్డి మాచమల్ల బుజ్జన్న బొయిని సందీప్ గట్టు అజయ్,అనిల్ , రాజశేఖర్ జూపాక రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నకు అండగా రైతు భరోసా... జిల్లాలో రూ.318.42 కోట్ల నిధుల జమ.

- 1.78 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా.
- రైతు భరోసా నిధులను ఇతర బకాయిలకు సర్దుబాటు చేయొద్దు: బ్యాంకులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం.

భద్రాద్రి కొత్తగూడెం/ కొత్తగూడెం/ జూలై 11 / అక్షరం న్యూస్ –:

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు రైతులకు సాగు పెట్టుబడికి అవసరమైన ఆర్థిక తోడ్పాటును సకాలంలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో అర్హులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రైతులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాగు పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం విడతల వారీగా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 1,78,828 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.318.42 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేయడం ద్వారా





వంపిణీ ప్రక్రియను పూర్తిచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో పారదర్శకంగా, వేగవంతంగా నిధుల పంపిణీ నిర్వహించినట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా, రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, సాగునీటి సౌకర్యాల కల్పన తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు సాగు పెట్టుబడిపై ఆర్థిక భరోసా కల్పించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో జమయ్యే నిధులను బ్యాంకులు ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ బకాయిలు, సేవా ఛార్జీలు లేదా ఇతర బకాయిల పేరుతో నిలుపుదల చేయడం, డెబిట్ చేయడం లేదా సర్దుబాటు చేయరాదని జిల్లా కలెక్టర్ అంకిత్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సాగు పెట్టుబడి కోసం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం పూర్తి మొత్తంలో రైతుల వినియోగానికి అందుబాటులో ఉండేలా అన్ని బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా నిధులపై ఎలాంటి అనధికారిక కోతలు విధించకుండా ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని రైతులకు పూర్తిగా అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

## వంగపల్లి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి ....

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపు....
- రూ.224 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.
- సభలో పాల్గొననున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే లు.

యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూలై 11 / : యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి గ్రామంలో ఆదివారం రోజు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రోజు మీడియా సమావేశం నిర్వహించిన బీర్ల అయిలయ్య , రేపు నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.224 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు వంగపల్లి గ్రామంలో ఘనంగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ,ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, హాజరుకానున్నట్లు వెల్లడించారు. అలాగే, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన చైర్మన్లు, డైరెక్టర్లను ఇదే వేదికపై ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు..రూ.224 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులు: ఆలేరు -- జీడికల్ రహదారి : రూ.17 కోట్లు , జీడికల్ -- గుండాల -- మోత్కూర్ రహదారి : రూ.35 కోట్లు ,వంగపల్లి -- ఖప్రాయిపల్లి రహదారి : రూ.90 కోట్లు , ఆలేరు -- జగదేవ్‌పూర్ (చల్లూరు, ఇబ్రహీంపూర్ మీదుగా) : రూ.61 కోట్లు ,తుర్కపల్లి -- రంగాపూర్ (మాదాపూర్, చీకటిమామిడి మీదుగా) : రూ.20.60 కోట్లు , ఈ రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి పైలాన్‌ను మంత్రులు ప్రారంభించనున్నట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమా ఆటోగ్రాఫ్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారం తో, పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క ,రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలకు



శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాజెక్టులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యం అందడంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించగలరని, వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం రోజు నిర్వహించనున్న ఈ చారిత్రాత్మక బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పి ఏ సి ఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, రైతులు, యువత, మహిళలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు..

## ఎన్నో వినతి పత్రాల కల సహకారం ఓదెల ఎస్ బి ఐ బ్యాంక్

ఓదెల/ పెద్దపల్లి జులై 11(అక్షరం న్యూస్)


కొన్ని ఏళ్లుగా ఓదెల గ్రామంలో ఎస్ బి ఐ బ్యాంకు సేవల కోసం అనేక వినతి పత్రాలు ఇచ్చిన సందర్భంగా ఎస్బిఐ అధికారులు స్పందించి ఎట్టకేలకు ఓదెల గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ని ఏర్పాటు చేశారు ఈ బ్యాంకు శనివారం ఘనంగా పూజలు నిర్వహించి బ్యాంకు ను ప్రారంభించారు ఈ సందర్భంగా మేనేజర్ భాస్కర్ గొల్ల మాట్లాడుతూ ఈరోజు పూజ నిర్వహించడం జరిగిందని సోమవారం నుండి బ్యాంకు సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ప్రజలంతా బ్యాంకును వినియోగించుకోవాలని అన్నారు మండలంలోని 22 గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని కొత్త



ఖాతాలు ప్రారంభం తో పాటు వివిధ రకాల రుణాలు ఇతర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు

ఈ సందర్భంగా సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ మాట్లాడుతూ ఓదెల గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన బ్యాంకు వదలకు రావడం ఎంతో సంతోషకరమైన విషయం అని బ్యాంకు రావడం కోసం అనేకమంది అనేక రకాలుగా ప్రయత్నాలు చేశారని వారి కోరిక ఫలించి బ్యాంకు ను ప్రారంభించుకోవడం జరిగిందని ప్రజలంతా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు

ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ భాస్కర్ గొల్ల తో పాటు క్యాషియర్ క్రాంతి సపోర్ట్ స్టాఫ్ రమణ సర్పంచ్ సతీష్ మరియు వార్డు సభ్యులు దూలం సదానందం తో పాటు. వ్యాపారవేత్త సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## చైన్ స్నాచింగ్‌లు బైక్ చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **గ్రామాల్లో మైక్ ప్రచారం నిర్వహించాలని సర్పంచ్‌లకు ముల్కనూర్ ఎస్సై రాజు సూచన..**




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూలై 11/అక్షరం న్యూస్:-

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, బైక్ చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముల్కనూర్ ఎస్సై రాజు సూచించారు. ముఖ్యంగా మహిళలు ఉదయం రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలను ప్రదర్శించకుండా చీర కొంగు లేదా చున్నీతో మెడలోని ఆభరణాలను కప్పుకోవాలని సూచించారు. వ్యవసాయ పొలాలకు ఒంటరిగా వెళ్లే మహిళలు విలువైన నగలు ధరించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్‌లు, గ్రామ సిబ్బంది మైక్ ప్రచారం లేదా ఆటో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సై రాజు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## బనానా షేక్ లేదా అరటి పండ్లు.. రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచిదా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.

### మిల్క్ షేక్ వద్దు..

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటిపండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

### జీర్ణ క్రియకు ఆటంకం..

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు. కనుక అరటిపండును నేరుగా తీసుకోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు.

ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉండడంతో పాటు శరీరానికి పోషకాలు కూడా చక్కగా అందుతాయి. పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడే వారు బనానా షేక్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.


## బొమ్మకూరు రిజర్వాయర్ నుండి మండేల గూడెం రైతులకు సాగు నీరు అందించే బాధ్యత నాది...






- **స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూలై 11:గోదావరి జలాలతో బొమ్మకూరు రిజర్వాయర్ నింపి మండేలగూడెం గ్రామానికి ఖరీఫ్ సీజన్ లో సాగు నీరు అందించి రైతుల పంటలను కాపాడే బాధ్యత నాదని, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మండేలగూడెం గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభం, నిర్మాణం పూర్తయిన అయిదు ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలతో పాటు రూ.10 లక్షల వ్యయం తో నిర్మించే సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ డ్యాగల రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనా రెండున్నర ఏళ్లలో మండేలగూడెంకు 33/11 కేవి విద్యుత్తు సబ్-స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రూ.20 లక్షలతో కాలువ మరవ మృతులు చేపట్టి బొమ్మకూరు రిజర్వాయర్ నుండి మండేలగూడెం చెరువును గోదావరి జలాలతో నింపి సాగు నీరు అందిం చానని, దీంతో పంటలు బాగా పండి దిగుబడి పెరిగిందని అన్నారు. అలాగే మొదటి విడతలో 20 ఇందిరమ్మ ఇళ్లు మం జూరయ్యాయని, మరో 20 ఇందిరమ్మ ఇళ్లు. రూ.20 లక్షల సీసీ రోడ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గత 15 ఏళ్లుఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి గ్రామానికి ఒక ఇల్లు ఇచ్చాడా... ఒక రోడ్డు ఇచ్చాడా.. తాగడం.. తినడం.. ఎగిరి గంతులు వేయడం తప్పఏమి చేశాడో మీరే ఆలోచించుకోవాలని ప్రజలను కోరుతూ పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే రాజయ్యపై మండిపడ్డారు. రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, రైతు భరోసా తదితర పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రజల సంక్షేమానికి అంకిత భావంతో కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మీ అందరి ఆశీర్వాదం ఎల్లవేళల ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారు జోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, బొనాసి క్రాంతికుమార్, మే కల నరేందర్, లింగాజీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి. నామాల బుచ్చయ్య. ఉత్తేపు సత్యనారయణ, ఉప సర్పంచ్ బోనాసి కొంరయ్య, కోళ్ల రవి, కావటి భాస్కర్. ఇబ్రహీం పాషా, గౌరిగ రవి, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు






## ఈ నడక గుండెకు భరోసా



తిండి కలిగితే కండ కలదోయ్ అన్నట్టే, కొవ్వు పెరిగితే.. గుండె జబ్బు కలుగోయ్ అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. గుండె ఆరోగ్యానికీ, శరీరంలో కొవ్వుకీ సంబంధం ఉంది. గుండెలో ఉన్న సమస్యకు, శరీరంలో ఉన్న కొవ్వుకి ఒకటే పరిష్కారం. వ్యాయామం. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు. గుండె ఆరోగ్యాన్ని పెంచుకునే వ్యాయామం చేస్తూ.. కొవ్వుని తగ్గించేలా కొన్ని నియమాలు పాటిస్తే డబుల్ బెనిఫిట్స్ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేమిటంటే... ట్రెడ్ మిల్ మీద కేవలం పరుగే కాక నడకనూ అలవాటు చేసుకోవాలి. రోజువారీగా ట్రెడ్ మిల్ మీద పరుగెత్తే సమయంలో పది నుంచి పన్నెండు శాతం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సమయాన్ని నడకకు కేటాయించాలని చెబుతున్నారు. ఆ నడక కూడా ట్రెడ్ మిల్ మీదే. నడకలోనూ వేగం ఉండాలన్నది నిబంధన. గంటకు రెండు నుంచి మూడు మైళ్ల వేగంతో ట్రెడ్ మిల్ స్పీడ్‌ని సెట్ చేసుకోవాలి. ఈ వేగంతో 30 నిమిషాల నుంచి 60 నిమిషాల పాటు వాక్ చేయాలి. ఇలా వారంలో మూడుసార్లు చేస్తే శరీరంలోని కొవ్వు నిల్వలు కరిగిపోవడంతోపాటు రక్తంలోని గ్లూకోజ్ అంతా ఖర్చవుతుందట. కొత్తగా కొవ్వు పేరుకునేకి ఆస్కారమూ ఉండదు. సుదీర్ఘమైన స్పీడ్‌వాక్ గుండె వేగాన్ని మెరుగుపరుస్తుంది. రెండు సమస్యలూ ఉన్నట్లయితే.. మీ వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ సలహా తీసుకున్న తర్వాతే ట్రెడ్ మిల్ మీద ముందడుగు వేయండి.

## చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగాలంటే.. వీటిని తీసుకోవాలి..




ఆరోగ్యానికి కొలెస్ట్రాల్ చాలా అవసరం. కొలెస్ట్రాల్ సహజంగానే హానికరం కాదు. కొలెస్ట్రాల్ వివిధ శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తుంది. హార్మోన్ల ఉత్పత్తికి, విటమిన్ డి, పిత్త ఆమ్లాల ఉత్పత్తికి ఇది చాలా అవసరం. కొలెస్ట్రాల్ లో కూడా మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ అని రెండు రకాలు ఉంటాయి. కొలెస్ట్రాల్ శరీరానికి అవసరమే అయినప్పటికీ తక్కువ స్థాయిలో మంచి కొలెస్ట్రాల్ ఉండడం, ఎక్కువ స్థాయిలో చెడు కొలెస్ట్రాల్ ఉండడం వల్ల గుండె ప్రమాదాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల ధమనుల్లో ఫలకాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని అథెరోస్క్లెరోసిస్ అంటారు. ధమనులు గట్టిపడడం, సంకోచించడం వల్ల రక్తప్రవాహం సాఫీగా సాగదు. దీంతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అలాగే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, అధిక రక్తపోటు, పిత్తాశయంలో రాళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కనుక శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. ఆహారంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు.

### ఫైబర్, గింజలు..

రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్న వారు కొవ్వు కలిగిన ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. ఫైబర్ ను ఎక్కువగా తీసుకోవాలి. రోజూ 10 నుండి 25 గ్రాముల కరిగే ఫైబర్ ను తీసుకోవడం లక్ష్యంగా పెట్టుకోవాలి. దీని వల్ల మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. నూనెలో వేయించిన, ప్యాక్ చేసిన ఆహారాలు చెడు కొలెస్ట్రాల్ ను పెంచుతాయి. కనుక వీటికి దూరంగా ఉండాలి. ఆలివ్ నూనె, అవకాడో, గింజలు వంటి ఆహారాలను తీసుకోవాలి. సాల్మన్, మాకేరెల్ వంటి చేపలను ఆహారంగా తీసుకోవాలి. భోజనంలో చిక్కుళ్లు, గింజలు, తృణ ధాన్యాలు వంటి వాటిని తీసుకోవాలి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి.

### 5 నుంచి 10 శాతం బరువు తగ్గాలి..

అలాగే ఆరోగ్యకరమైన శరీర బరువు ఉండేలా చూసుకోవాలి. శరీర బరువులో 5 నుండి 10 శాతం వరకు తగ్గడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తూ ఉండాలి. నడక, ఈత, సైక్లింగ్ వంటివి చేయడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి.

# గందరగోళంగా సర్ ప్రక్రియ !



హైదరాబాద్,జూలై11: సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు.

మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం

ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

## ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మాణి

- మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026 అవార్డు అందచేత
- అభినందనలు తెలిపిన చంద్రబాబు, నారా లోకేశ్




అమరావతి,జూలై11 హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ – 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం. ఢిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026' సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు, సంస్థ ఉద్యోగులకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో బ్రాహ్మణి నిలవడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని ఆకాంక్షించారు. 'ఫార్చ్యూన్ ఇండియా' విడుదల చేసిన 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్' జాబితాలో నారా బ్రాహ్మణికి చోటు దక్కడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. బ్రాహ్మణి ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. ఇది ఆమె నాయకత్వం, దూరదృష్టి, అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపని కొనియాడారు. బ్రాహ్మణి సాధించిన ఈ ఘనత యువతులకు, ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్‌లో కూడా బ్రాహ్మణి మరిన్ని విజయాలు సాధిస్తూ, కొత్త మైలురాళ్లను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తన సందేశంలో తెలిపారు.

## సాయికృష్ణ విచారణలో అడ్డంకిగా నిబంధనలు

### సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం

అమరావతి,జూలై11 సాయికృష్ణ లాకప్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సిట్ సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఐ నాగరాజు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన కఠిన నిబంధనలపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న షరతును సిట్ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. నిరంతర వీడియో నిఘా వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సీన్ రికన్‌స్ట్రక్షన్‌కు హైకోర్టు కండీషన్లు అడ్డంకిగా మారాయని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేసింది. నిందితుడిని ఎటువంటి కఠిన షరతులు లేకుండా విచారించేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. కాగా, విజయవాడలో సంచలనం సృష్టించిన కస్టోడియల్ డెత్ కేసులో నిజాలు రాబట్టేందుకు సుప్రీంకోర్టు తీర్పు కీలకంగా మారింది. సిట్ వేసిన ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

### మరోమారు ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు



సిద్దిపేట,జులై11 ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

## లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేత

జగిత్యాల,జులై11 జగిత్యాల నియోజకవర్గంలోని పలువురు లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఎల్ రమణ శనివారం అందజేశారు. వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం జగిత్యాల నియోజకవర్గంలోని తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన లక్షా యాభైవేల రూపాయల చెక్కులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ లబ్దిదారులకు ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణ కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీశ్, మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ, రాయికల్ మండలం ప్రధాన కార్యదర్శి కొండపల్కల రత్నాకర్ రావు, వొల్లాల గంగాధర్, గంగిపెల్లి వేణుమాధవ్, పెండెం గంగాధర్, చిరంజీవి, నందు నాయక్ పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం.. కొబ్బరికాయలు కొట్టిన ఎమ్మెల్యే

తిరుపతి,జులై 11 జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తిరుపతిలోని అలిపిరి గరుడ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్‌కు శస్త్ర చికిత్స విజయవంతం అయిందన్నారు. దేశం, రాష్ట్రం బాగుండాలని కోరుకునే గొప్ప నాయకుడు పవన్ కల్యాణ్ అని కొనియాడారు. శస్త్ర చికిత్స తర్వాత పవన్ త్వరగా కోలుకావాలని శ్రీవేంకటేశ్వర స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షులు రాజా రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్

### ఒకే రాత్రి నాలుగు చోట్ల దొంగతనాలు

నిజామాబాద్,జులై 11 నిజామాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్ సృష్టించింది. ఒకే రాత్రి నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత టాటా సుమోలో వచ్చిన నలుగురు దొంగలు ముందుగా నిర్మల్ జిల్లాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దోపిడీకి పాల్పడ్డారు. అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించి, తెల్లవారుజామున ఆర్మూర్ పట్టణంలోని ఓ మెడికల్ షాప్ షట్టర్ ధ్వంసం చేసి అందులోని సుమారు లక్షన్నర నగదును దోచుకున్నారు. అనంతరం ఆ దొంగల ముఠా తమ వాహనంలో తెల్లవారుజామున 4.55 గంటల వరకు శ్రీనగర్ కాలనీకి చేరుకుని.. లక్ష్మి అనే మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు తెంపుకుని పరారయ్యారు. ఆ తర్వాత ఉదయం 5.25 గంటల వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడుతో పాటు ఒక చెవికమ్మను లాక్కున్నారు. మరో చెవికమ్మ లాక్కునే ప్రయత్నం చేస్తుండగా బాధితురాలి కేకలు విని ఆమె భర్త బయటకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. దీంతో వారు టాటా సుమో వాహనంలో అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా ఈ చోరీలకు పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఘటనాస్థలిని పరిశీలించిన నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య ఘటనాస్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు అధికారులకు కీలక సూచనలు చేశారు. ఘటన జరిగిన ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాలని.. నిందితులను వేగంగా పట్టుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిజనులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరం

### మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విజయనగరం,జులై 11 సాలూర ప్రాంతీయ ఆసుపత్రిలో రాష్ట్ర గిరిజన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రక్తదానం చేసిన దాతలను అభినందించారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనత సమస్యతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు బాధపడుతున్నారన్నారు. అలాగే ప్రమాదాలకు గురైన వారికి రక్తం అందుబాటులో లేక ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. అటువంటివారిని ఆదుకునేందుకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించామని మంత్రి అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన దాతలు అందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. పోలీసులు, ప్రాంతీయాసుపత్రి సిబ్బంది, తెదేపా నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారిని మీనాక్షి, ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ నియోజకవర్గ తెదేపా నేతలు పాల్గొన్నారు.

## బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనుల్లో విషాదం

చెన్నై,జులై 11 తమిళనాడులో విషాద ఘటన చోటుచేసుకుంది. చెంగల్పట్టు జిల్లా మామల్లపురంలో బోర్‌వెల్ తవ్వకాల సమయంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. శనివారం మామల్లపురం ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ ఎదురుగా బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో డ్రిల్లింగ్ యంత్రం సమీపంలోని విద్యుత్ లైన్‌కు తాకినట్లు సమాచారం. విద్యుత్ తీగలకు డ్రిల్లింగ్ యంత్రం తగలడంతో ఒక్కసారిగా కరెంట్ ప్రవహించింది. అక్కడే పనిచేస్తున్న నలుగురు కార్మికులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, సహాయక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ఘటనకి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించి, అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు.

## ఐదు వికెట్లతో రెచ్చిపోయిన క్రాంతి గౌడ్.. 170కే ఇంగ్లండ్ ఆలౌట్..!



లార్డ్స్‌లో జరగుతున్న చరిత్రాత్మక టెస్టులో భారత పేసర్ క్రాంతి గౌడ్(3-25) నిప్పులు చెరిగింది. తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లండ్ నడ్డివిరిచింది. స్వింగ్‌తో టాపార్డర్‌ను కూల్చిన క్రాంతి.. లంచ్ తర్వాత విజృంభించగా ఆతిథ్య జట్టు 170కే ఆలౌటైంది. అమీ జోన్స్(52), కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) మినహా ఎవరూ రాణించకపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 115 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సయాలీ సత్ఘరే(1-36), స్నేహ్ రాణా(1-35) రాణించారు.లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్(5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా(2-41) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు.


## వింబుల్డన్‌కు క్రికెట్ కళ.. రాయల్ బాక్స్‌లో గిల్, సచిన్..!



ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ టోర్నీకి క్రికెట్ కళొచ్చింది. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ గ్యాలరీలో సచిన్ టెండూల్కర్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(రాష్ట్రబఎమ్ఖఅ +అశ్రీశ్రీ) తళుక్కుమన్నారు. రాయల్ బాక్స్‌లో రాయల్ లుక్‌తో గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. సతీమణి అంజలి సమేతంగా సచిన్ హాజరయ్యాడు. విరామంలో వీరితో టెన్నిస్ గ్రేట్ రోజర్ ఫెదరర్ కలవడంతో కెమెరా కళ్లన్నీ వీరివైపే తిరిగాయి.వన్డే సిరీస్‌కు ముందే ఇంగ్లండ్ చేరుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బిజీగా గడుపుతున్నాడు. పాప్ సింగర్లను కలిసి.. మెర్సిడెజ్ బెంజ్ గ్యారేజ్‌లో ఫార్ములా వన్ రేసర్ ఆంటినెల్లాతో కలిసి కారిడార్ క్రికెట్ ఆడిన గిల్ ఈసారి వింబుల్డన్‌లో మెరిశాడు. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీసమేతంగా మ్యాచ్ చూసేందుకు రాగా.. రాయల్ బాక్స్‌లో వారి పక్కనే కూర్చున్నాడు టీమిండియా కెప్టెన్. మ్యాచ్ చూసేందుకు వచ్చిన వెస్టిండీస్ వెటరన్ బ్రియాన్ లారా, టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెదరర్‌తో కాసేపు ముచ్చటించాడు గిల్. జకోవిచ్, సినర్ మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ వీక్షించారు వీరంతా.

**డబుల్స్ భాగస్వామిగా**

అనంతరం మీడియాతో మాట్లాడిన గిల్.. 'క్రికెట్ బదులు ఏ ఆటను ఎంచుకుంటారు?' అనే ప్రశ్నకు 'టెన్నిస్' అని బదులిచ్చాడు. అయితే.. తనకు డబుల్స్ భాగస్వామిగా కార్లోస్ అల్కరాజ్(ఝతీశ్రీశీం ాశ్రీఝతీఝఓ) ఉండాలని అతడు చెప్పాడు. అల్కరాస్ ఆటను ఎంతో ఆస్వాదిస్తాడని చెప్పిన భారత సారథి.. అతడితో ఆడడం ఎంతో సరదగా ఉంటుందని అన్నాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య జూలై 14 నుంచి మూడు వన్డేల సిరీస్ మొదలవ్వనుంది. శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో పొట్టి సిరీస్ కోల్పోయిన టీమిండియాకు వన్డే సిరీస్ విజయం కట్టబెట్టాలని గిల్ పట్టుదలతో ఉన్నాడు.



# 100 మీటర్లు 10.14 సెకన్లలో.. తొలి భారతీయుడిగా అనిమేశ్ రికార్డు..!

భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఆశాకిరణంగా అవతరించిన అనిమేశ్ కుజుర్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇండియన్ ఉసేన్ బోల్ట్‌గా పేరొందిన ఈ కుర్రాడు విదేశీ గడ్డపై 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. జర్మనీ వేదికగా జరిగిన పుమా ఫాస్ట్ ఆర్స్ట్ లెగ్స్ 2026 మీట్(ూఖహీూ ఖీఝర ాూతీఎం ావస్త్రం 2026 వీవవ్)లో సత్తా చాటిన అనిమేశ్ భారత్ అవతల ఇంత వేగంతో వంద మీటర్లు పరుగెత్తిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు.ట్రాక్ మీద బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్దలు కొడుతున్న అనిమేశ్ కుజుర్ మళ్లీ మెరిశాడు. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద గురి పెట్టిన అతడు పుమా పాస్ట్ ఆర్స్ట్ లెగ్స్ 2006 మీట్‌లో చిరుతలా పరుగుతీశాడు. 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేసి ఔరా అనిపించాడు. తొలుత 10.19 సెకన్లకు పరిమితమైన అనిమేశ్ ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అయితే.. అత్యంత వేగంగా 100 మీటర్ల పరుగుతో రికార్డు సాధించిన గురిందెర్వీర్ సింగ్(10.09 సెకన్లు)ను మాత్రం అందుకోలేకపోయాడీ రన్నర్.




### 100 మీటర్ల చిరుతలు

1. గురిందెర్వీర్ సింగ్ -- 10.09 సెకన్లు
2. అనిమేశ్ కుజుర్ -- 10.14 సెకన్లు
3. అనిమేశ్ కుజుర్ -- 10.15 సెకన్లు
4. గురిందెర్వీర్ సింగ్ -- 10.17 సెకన్లు
5. అనిమేశ్ కుజుర్ -- 10.18 సెకన్లు

### గురిందెర్వీర్‌కు పోటీగా..

అనిమేశ్ కుజుర్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని మారుమూల గ్రామం. ఆరడుగుల రెండు అంగుళాల పొడవుండే ఇతడు టీనేజ్ నుంచే తన స్పీడ్‌తో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈమధ్యే 100 మీటర్ల దూరాన్ని 10.18 సెకన్లలో చేరుకొని చరిత్ర సృష్టించాడు. తద్వారా గురిందెర్వీర్ (10.20 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును బద్ధలు కొట్టి 'ది ఫాస్టెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అవతరించాడు అనిమేశ్. 22 ఏళ్లకే దేశం గర్వించదగ్గ అథ్లెట్‌గా మారిన అతడు ఈమధ్యే మొనాకో డైమండ్ లీగ్‌లో పోటీపడ్డాడు.

## మెస్సీకి 'పెనాల్టీ' షాక్ ఇస్తారా?.. అర్జెంటీనా మేనేజర్ సమాధానమిదే..!

ఫిఫా వరల్డ్‌కప్‌లో నాకౌట్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా(ూతీస్త్రవతీఱఅఖ) క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు వేళైంది. కొలంబియాకు చెక్ పెట్టిన స్విట్జర్‌లాండ్‌ను లియోనల్ మెస్సీ(ాఅశీఅవశ్రీ వీవంంఱ) సేన ఢీకొట్టనుంది. కీలకమైన మ్యాచ్ కావడంతో ఏ చిన్న పొరపాటు చేయొద్దని ఇరుజట్లు భావిస్తున్నాయి. అయితే.. ఫామ్‌లో ఉన్న మెస్సీ పెనాల్టీలను గోల్‌గా మలచలేకపోవడం డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను వేధిస్తోంది. ఈ నేపథ్యంలో స్విస్ మ్యాచ్‌కు ముందు అర్జెంటీనా మేనేజర్ లియోనల్ స్కలోని(ాఅశీఅవశ్రీ ాఝశ్రీశీఅఱ) మీడియాతో మాట్లాడుతూ పెనాల్టీ అవకాశం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆడుతున్న అర్జెంటీనాకు నాకౌట్‌లో సవాళ్లు ఎదురవుతున్నాయి. కార్బో వెర్డే, ఈజిప్ట్ చేతిలో అతికష్టమ్మీద గట్టెక్కిన మెస్సీ సేన.. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్‌లాండ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. ఆదివారం ఉదయం 6 గంటలకు మ్యాచ్ ఉన్నందున మేనేజర్ లియోనల్ స్కలోని మీడియాతో మాట్లాడాడు. ఈ ఎడిషన్‌లో రెండు పెనాల్టీలను గోల్ పోస్ట్‌లోకి పంపని మెస్సీకి మరో అవకాశం ఇస్తారా? లేదా? అనే ప్రశ్నకు అతడు అవును అనిగానీ, కాదు అనిగానీ చెప్పలేదు.

'పెనాల్టీని ఉపయోగించుకోవాలా? వద్దా? అనేది పూర్తిగా మెస్సీ చేతుల్లో ఉంది. అతడికి నచ్చినట్టు చేయని. అతడు వద్దనుకుంటే పెనాల్టీ షాట్ ఆడేందుకు ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారు. అయితే.. మెస్సీ తానే ఆ అవాశాన్ని తీసుకుంటాననంటే మేము కాదనం. మైదానంలో అతడు ఏ నిర్ణయం తీసుకున్నా సరే ఆమోదిస్తాం. పెనాల్టీ ఆడాలా? వద్దా? అనే విషయాన్ని మెస్సీకి చెప్పాలనే విషయంపై నాలోనే సందిగ్ధత ఉంది. ఎందుకంటే 39 ఏళ్లున్న మెస్సీ ఇప్పటికీ గొప్ప ఆటగాడే' అని స్కలోని వెల్లడించాడు. ఫిఫా వరల్డ్‌కప్‌లో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లకు అర్జెంటీనా రిఫరీలను నియమించడం, మెస్సీ బృందానికి అనుకూలంగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు అనే విషయాలపైనా స్కలోని స్పందించాడు. 'మేము గత ఎడిషన్‌లో విజేతగా నిలిచినందున ఈసారి తమను గెలవనీయొద్దని కొందరు అలా మాట్లాడుతున్నారు. నిజానికి వీఏఆర్ టెక్నాలజీ ఉపయోగంతో అన్ని జట్ల మాదిరిగానే మేము నష్టపోతున్నాం. అందరూ అనుకుంటున్నట్టు అర్జెంటీనాకు ఫిఫా యాజమాన్యం, రిఫరీలు సాయం చేయడం లేదు' అని స్పష్టం చేశాడు.

**ఆస్ట్రియా.. ఈజిప్ట్‌పై**

లీగ్ దశలో ఆస్ట్రియాపై పెనాల్టీని మిస్ చేసిన మెస్సీ.. 16వ రౌండ్‌లో ఈజిప్ట్‌పైనా పెనాల్టీని గోల్‌పోస్ట్‌లోకి పంపడంలో విఫలమయ్యాడు. అయినా.. చివరకు మెరుపు గోల్‌తో జట్టును క్వార్టర్స్‌కు తీసుకెళ్లాడీ సాకర్ లెజెండ్. ఎనిమిది గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో నిలిచిన మెస్సీ స్విట్జర్‌లాండ్‌పై మెరిస్తే.. కిలియన్ ఎంబాపే రెండో స్థానానికి పడిపోయే అవకాశముంది.




## బెల్జియంపై 2-1 తేడాతో విక్టరీ.. ఫిఫా వరల్డ్‌కప్ సెమీస్‌లోకి స్పెయిన్

లాస్ ఏంజిల్స్: ఫిఫా వరల్డ్‌కప్ సెమీస్‌లోకి స్పెయిన్ ప్రవేశించింది. క్వార్టర్స్ మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో బెల్జియంపై గెలుపొందింది. సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ మైకేల్ మెరినో ఆఖరి నిమిషాల్లో గోల్ కొట్టి.. స్పెయిన్ శిబిరంలో సంబరాలు నింపాడు. ప్రీ క్వార్టర్స్‌లో పోర్చుగల్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ మెరినో చివరి క్షణాల్లో గోల్ చేసి అద్భుత విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. బెల్జియం గోల్ కీపర్ గాయం వల్ల తప్పుకోవడంతో.. బ్యాకప్ కీపర్‌గా వచ్చిన లెమ్మెన్స్ బంతిని అందుకోవడంలో విఫలమ్యాడు. ఆ కీపర్‌ను తాకిన బంతి.. మళ్లీ ముందుకు వచ్చింది. ఆ సమయంలో మెరినో దాన్ని గోల్‌గా మలిచాడు. గోల్ పోస్టు రూఫ్ లోపల ఆ బంతి తగిలింది. ఆట 88వ నిమిషంలో ఆ గోల్ వచ్చింది. తొలుత స్పెయిన్ జట్టులో ఫాబియానా రూయిజ్ 30వ నిమిషంలో గోల్ చేశాడు. అయితే బెల్జియం ప్లేయర్ డీ కేటిలేరి 41వ నిమిషంలో గోల్ చేశాడు. సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన స్పెయిన్.. టోర్నమెంట్ ఫవరేట్ ఫ్రాన్స్‌తో ఈ శుక్రవారం తలపడనున్నది.



## భాగ్యశ్రీ బోర్సే ..భావోద్వేగం



'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

## తండ్రిని హత్తుకున్న అఖిల్



అఖిల్ మూవీ హిట్ అయితే చూడాలని ఆశగా ఎదురుచూసిన అక్కినేని అభిమానుల కల నెరవేరింది. ఆయన కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందిన రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా అఖిల్ నటన, ద్వితీయార్ధంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ సక్సెస్ సెలబ్రేషన్స్ జరిగాయి. చిత్ర బృందం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంది. ఈ సందర్భంగా తండ్రి నాగార్జున పాదాలకు నమస్కరించిన అఖిల్.. ఆయన్ను గట్టిగా హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు.

## 24న రామాయణ ట్రైలర్ విడుదల




భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

## ఓ సుకుమారి ట్రైలర్ విడుదల





'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మురుగన్ నేపథ్యంలో చిత్రాల నిర్మాణం

### తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు




దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది.




తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బ్జడెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా..

### లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున



తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ




చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# మరో ప్రేమ కథాచిత్రం హృదయ మురళి

తమిళ హీరో అథర్వ 'హృదయం మురళి' అనే అనువాద చిత్రంతో బాక్సాఫీస్ బరిలో నిలిచారు. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని హృదయ (అథర్వ) అనే కుర్రాడి కథ ఇది. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన అతణ్ని మామయ్య (నట్టి సుబ్రహ్మణ్యం) అన్నీ తానై పెంచి పెద్ద చేస్తాడు. చిన్నప్పుడు స్కూల్లో తన ఇంగ్లీష్ టీచర్ గీత (జోనితా గాంధీ)పై పుట్టిన అమాయకపు క్రష్ నుంచి.. ట్యూషన్‌లో సమంత (ప్రీతి ముకుందన్).. కాలేజీ రోజుల్లో అముద (కయాదు).. ఇలా హృదయ జీవితంలో వివిధ దశల్లో పలు ప్రేమకథలుంటాయి. ప్రతి ఒక్కర్నీ గాఢంగా ప్రేమించినా.. మనసులోని ప్రేమను వ్యక్తపరచలేకపోతాడు. అయితే అదితి (మాళవిక మోహనన్)తో పెళ్లి పీటలెక్కడానికి పదిరోజుల సమయం ఉందనగా.. తన మనసులో దాగి ఉండిపోయిన ప్రేమని వ్యక్తపరిచేందుకు ఫ్రెండ్స్‌తో కలిసి న్యూయార్క్‌కి బయలుదేరుతాడు హృదయ. మరి ఆ తర్వాత ఏమైంది? సరిగ్గా పెళ్లికి ముందు తన గత ప్రేమ జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ హృదయ ఎవరి దగ్గరకి వెళ్లాడు? ఈ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగా నిజమైన ప్రేమని దక్కించుకున్నాడా? సమంత, అముద, అదితిల్లో ఎవరితో కలిసి పెళ్లి పీటలెక్కాడు? అన్నది మిగిలిన కథ. వన్ సైడ్ లవ్‌స్టోరీస్ వెండితెరకు కొత్తేమీ కాదు. అయితే వీటిలో మనసులోని ప్రేమను బయట పెట్టలేక ఒంటరి ప్రేమికులుగా మిగిలిన ప్రేమకథలెప్పుడూ ప్రత్యేకమే. ఈ 'హృదయం మురళి' కూడా ఆ కోవకు చెందిన చిత్రమే. అయితే దీన్ని 90ల నాటి నోస్టాల్జియా మూమెంట్స్‌తో ముడిపెట్టి.. పాత జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. ఈతరం ప్రేక్షకులకూ కనెక్ట్ అయ్యేలా వినోదాత్మకంగా తీర్చిదిద్దిన తీరు ఆద్యంతం అలరిస్తుంది. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని ప్రేమికుడిగా హృదయ పాత్రలో అథర్వ ఒదిగిపోయాడు. ఆద్యంతం చక్కని నటనతో కట్టిపడేశాడు. ప్రీతి ముకుందన్ తెరపై అందంగా కనిపిస్తూనే.. చక్కటి అభినయాన్ని చూపించే అవకాశం దొరికింది. ఆమె పాత్రకి ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. అముదగా కయాదు కనిపించినంత సేపూ అలరిస్తుంది. తమన్, నిహారిక, ద్రవిడ్ తదితరుల పాత్రలు కథని ముందుకు తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషించాయి. నేపథ్య సంగీతం సినిమాకి తగ్గట్లుగా కుదిరింది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్నాయి

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609